క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: పామర్రు పట్టణ, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ మోహనకృష్ణారావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా శనివారం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి



తోట్లవల్లూరు: గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని చినపులిపాకలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.5 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రహదారి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం, కార్యదర్శి లుక్కా రేణుకారావు, సర్పంచ్ ఆరేపల్లి రాము పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ

గుడివాడ టౌన్: వ్యాపారులు, ఇతర దుకాణ సముదాయాల వారు ప్రజారోగ్యంపై శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాలలో శానిటేషన్ పరిస్థితులను పరిశీలించి పారిశుధ్యానికి విఘాతం కలిగించే వారికి హెచ్చరికలు జారీచేశారు. ప్రత్యేకించి చికెన్ సెంటర్లు, ఇతర మాంసాహార వ్యాపారులు వ్యర్థాలు నిర్లక్ష్యంగా పారవేయడాన్ని ఆయన తప్పుపట్టారు. అనంతరం స్థానిక స్టేడియం వద్దగల పశు సంవర్ధక ఆస్పత్రిలో వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



ముదినేపల్లి రూరల్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో ఇటీవల నిర్వహించిన అండర్–17 బాలికల విభాగంలో కబడ్డీ పోటీలకు మండలంలోని చిగురుకోట జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ఆశ్లేష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శాంతి రామోజీ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు వ్యాయమ ఉపాధ్యాయుడు విద్యాకమిటీ చైర్మన్ వెంకటశ్యామల, ఉపాధ్యాయులు ఆశ్లేషను అభినందించారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు రూ. లక్ష బహూకరించినట్లు ఈఓ వై. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన బి.నాగమణి ఆమె తల్లిదండ్రులు ఎం. వెంకటేశ్వరరావు – సరోజిని గుర్తుగా ఈ వితరణ అందజేసినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని స్వామి వారి నివేదనాశాల నిర్మాణానికి వినియోగిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కె.రామ్ ప్రసాద్, ఆలయ ఉద్యోగి పీవీ మురళి పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం



కోసూరు(మొవ్వ): మొవ్వ మండల టూవీలర్స్ యూనియన్ సభ్యుడు కొక్కిలిగడ్డ ఏసురత్నం (45) అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఆ యూనియన్ సభ్యులు రూ.10వేల సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు పిట్టు శ్రీనివాసరావు, అధ్యక్షుడు రియాజ్, పసుకుర్తి శ్రీనివాసరావు, కర్రీమ్, వీరబాబు, కరీముల్లా, మహమ్మద్, లాల్‌బాషా, శివ, నాగరాజు షరీఫ్ పాల్గొన్నారు.

స్వల్పకాలిక రకాల వరి సాగుతో మేలు

- 1224 వరి రకం సాగు చేసిన రైతులు
- 125 రోజుల్లో పంట కోతకు రావటంతో హర్షం

ప్రకృతి వైపరీత్యాలకు దొరకని స్వల్పకాలిక రకాల వరిని సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నుంచి వరుసగా తుపాన్ల ప్రభావాలకు వరి రైతుల గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయి. ఏటా వచ్చే తుపాన్లను ముందస్తుగా గమనించిన కొన్ని గ్రామాల్లోని రైతులు స్వల్పకాలిక రకాల వరిని సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంట కోతకు వచ్చింది. దీంతో అన్నదాతలు వరికోతలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

గుడ్లవల్లేరు: స్వల్పకాలిక వరి రకాలు తుపాన్లకు దొరికినా.. వాటిని తట్టుకునే రకాలనే మండలంలోని పలువరు రైతులు ఎంపిక చేసుకున్నారు. ఆ పంట ఇపుడు చేతికి వచ్చేందుకు ఏపుగా ఎదిగింది. ఈ నెలాఖారుకు కోతలను మొదలు పెట్టేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. గుడ్లవల్లేరు మండలంలో 22,102 ఎకరాల్లో వరి సాగవుతోంది. 1224రకం వరిని సాగు చేయటంతో పాటు బీపీటీని ఎక్కువగా రైతులు మండలంలో సాగు చేయటంతో తక్కువ సమయంలో పంటను పండిస్తున్నారు. 25 నుంచి 30 రోజుల్లో రకాల వరి పంట కోతకు వచ్చేసింది. గుడ్లవల్లేరు మండలంలోని ఉలవలపూడి, కొతవరం, గుడ్లవల్లేరు గ్రామాల్లో కోతకు వచ్చేశాయి. ఈ నెలాఖరు లోపు ఈ పంట కోసెందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. 1318 వంటి దీర్ఘకాలిక రకాల వరి పంట ఇంకా కోతకు వచ్చేందుకు మరొక 25 నుంచి 30 రోజులు పట్టే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.



కోతకు వచ్చిన 1224 రకంతో పాటు పక్కనే ఇంకా కోతకు రాని 1318 రకం వరి పంట

తక్కువ కాలంలో పండే వరి ఎంపిక



మా గ్రామంలోని రైతులంతా ఒకేమాట మీద ఉండి తక్కువ కాలంలో పండే వరి రకాలనే ఎప్పుడూ ఎన్నుకుంటాం. ఆ కారణంగానే చుట్టుపక్కల గ్రామాల కంటే ముందుగా మా పంట చేతికి వస్తుంది. ఈ ఏడాది కూడా అదే బాటలో నడవటం వలన పంట వారంలో చేతికి వచ్చేస్తుంది. ఈ నెలాఖరులో వరి కోతలకు సిద్ధమవుతున్నాం.

– పామర్తి కన్య భాస్కరరావు, ఉలవలపూడి గ్రామ సర్పంచ్

స్వల్పకాలిక వరి రకాలతోనే మేలు



స్వల్పకాలక వరి రకాల పంట త్వరగా చేతికి అందుతుంది. 1224 వరి రకం 125 రోజుల్లో చేతికి అందుతుంది. అలాగే బీపీటీ 130 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఈ నెలాఖారుకు కోతలు ప్రారంభమవుతాయి. ఎకరానికి 30 నుంచి 35బస్తాల దిగుబడి వస్తుంది. 1318 వంటి దీర్ఘకాలిక వరి రకాల పంట చేతికి రావాలంటే 150 రోజులు పడుతుంది.

– ఎల్.సునీల్, గుడ్లవల్లేరు ఏఓ

సమయ పాలన పాటించని అధికారులు



ఉదయం 10.30 గంటలు దాటినా తెరచుకోని ఎంపీడీఓ రూమ్



అధికారులు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న ఈఓపీఆర్డీ, ఇతర అధికారుల కుర్చీలు

గుడివాడరూరల్: దిగువ స్థాయి సిబ్బందికి సమయ పాలన పాటించాలని చెప్పాల్సిన అధికారులే సకాలంలో విధులకు హాజరు కావడం లేదు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయాన్ని 'సాక్షి' సందర్శించగా అధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. మండల పరిషత్ అధికారి ఆఫీస్ రూం తాళాలు వేసి దర్శనమిచ్చాయి. పక్కనే ఉన్న ఈఓపీఆర్డీ, ఇతర అధికారులు రాకపోవడంతో కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. కార్యాలయం పైన ఉన్న మండల విద్యాశాఖ కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి. అందరికీ చెప్పాల్సిన ప్రధాన కార్యాలయ సిబ్బందే విధులను విస్మరించి నిబంధనలను పాటించకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ సిబ్బంది ఎప్పుడు వచ్చి ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియడం లేదని మండల ప్రజల ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్యాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

లైసెన్సులు పొందని దుకాణ యజమానులపై చర్యలు



కె.క్రాంతికుమార్, అగ్నిమాపకాధికారి

కైకలూరు: లైసెన్సులు పొందని బాణసంచా దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని కైకలూరు అగ్నిమాపకాధికారి కె.క్రాంతి కుమార్ హెచ్చరించారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా మూడు రోజులు లైసెన్సుల నిమిత్తం అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసుశాఖల జాయింట్ కమిటీ పరిశీలన చేసి దుకాణాలకు అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో దుకాణాల ఏర్పాటుకు అనుమతించామన్నారు. ముందస్తుగా ఎవరైనా బాణసంచాను నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రజలు టపాసులను ఖాళీ ప్రదేశాల్లోనే కాల్చాలన్నారు. ప్రతిఒక్కరూ కాటన్ దుస్తులు, చెప్పులు ధరించి, నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దుకాణాలకు మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. దుకాణాల వద్ద డ్రమ్ముల్లో నీరు, ఇసుక బక్కెట్లు, నిప్పును నిలుపుదల చేసే యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎటువంటి ప్రమాదం జరిగినా వెంటనే అగ్రిమాపక అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ఘనంగా కళాకారుల దినోత్సవం

పామర్రు: జాతీయ కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక హితమ్ స్కూల్లో పామర్రు ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వెంకట మురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ పలు రంగాల్లో నిష్టాతులైన వారిని గుర్తించి సన్మానించామన్నారు. ప్రముఖ కీబోర్డు ప్లేయర్ మాచిరాజు రాంబాబు, కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యామం, భారతరత్న గ్రహీత బసవరాజు, తబలా కళాకారులు శంకర్, లలిత సంగీత గాయకురాలు మల్లేశ్వరమ్మ, పామర్రు తాళం భజన అంజిరెడ్డి, చెక్క భజన గురువు సత్యనారాయణ రెడ్డి, గాయకులు అరవపల్లి రావు, సంజీవరావ్, కూచిపూడి మృదంగ కళాకారులు శాస్త్రిని సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యూరు కళాపీఠం అధ్యక్షుడు రఘుశర్మ పాల్గొన్నారు.



పామర్రులో కళాకారులను సన్మానిస్తున్న మురళీకృష్ణ, హేమంత్‌రెడ్డి

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

గుడివాడ టౌన్: లయన్స్‌క్లబ్ గుడివాడ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కళ్లజోళ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం స్థానిక కాకర్లవీధిలో నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో కంటి విభాగంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన 80 మందకి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎ. గోపిరెడ్డి, చైర్మన్ వేణుగోపాలరావు, కోశాధికారి జి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత నేత్ర వైద్యశిబిరం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి నిర్వాహకులు 340 మందికి కంటి పరీక్షలు చేశారు. స్వర్గీయ అరికెపూడి శివహర్ష స్మారకార్థం తండ్రి ఏఆర్‌కే చౌదరి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ శశికళ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటైజేషన్ వర్కర్లకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఎంఈఓకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న తమకు మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామసభలతో ప్రయోజనం

ముదినేపల్లి రూరల్: రీసర్వే గ్రామసభలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తహసీల్దార్ సుభానీ అన్నారు. మండలంలోని ఊటుకూరు, వాడవల్లి, కాకరవాడ గ్రామసచివాలయల వద్ద రీసర్వే గ్రామసభలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా రైతుల నుండి 79 అర్జీలు అందగా వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

గుడివాడ టౌన్: కార్తికమాసాన్ని పురస్కరించుకుని విశిష్ట శైవ పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ డి.రాజేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు రెండో తేదీ నుంచి 30వ తేదీ వరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులు సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శైవక్షేత్రాలైన పంచారామాలకు ప్రతి ఆదివారం రాత్రి, కార్తిక పౌర్ణమిరోజున అరుణాచలంతో పాటు యాగంటి, మహానంది, శ్రీశైలం ఆలయాలను దర్శించుకునేందుకు బస్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం గుడివాడ డిపో నుంచి 50 బస్సులు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆన్‌లైన్‌లో టికెట్‌లు బుక్ చేసుకునే వారు 99592 25464ను సంప్రదించాలని కోరారు.

యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక

గుడివాడ టౌన్: యూటీఎఫ్ గుడివాడ పట్టణ శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం స్థానిక సత్యనారాయణపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. పట్టణ శాఖ అధ్యక్షుడిగా మీరాహుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా కె. సతీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు నాయకులు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమా మహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బి. కనకారావు, గౌరవాధ్యక్షుడు ఎస్. ప్రభాకరరావు అభినందించారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సత్కారం

పమిడిముక్కల: కపిలేశ్వరపురం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యదర్శి మండవ సోమ విద్యాధర్, జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ మీరా, గ్రామ సర్వేయర్ బొప్పన ప్రత్యూష, బిల్ కలెక్టర్ వెంకటరమణ, వీఆర్వోలు శీలం నరసింహారావు, చిన్నం నాగేశ్వరరావును పంచాయతీ పాలకవర్గం, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుల్లా నాగమణి, ఎంపీటీసీ సభ్యులు మరీదు రాజ్యలక్ష్మి, కంచర్ల అంకకుమారి, ఉపసర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

పమిడిముక్కల: గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డీటీ యేసుపాదం రైతులకు సూచించారు. మండలంలోని ముళ్లపూడి గ్రామంలో శుక్రవారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ సమస్యలపై 28 మంది అర్జీలు అందజేసినట్లు యేసుపాదం తెలిపారు. సర్పంచ్ పక్కాల అంజిబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మండల సర్వేయర్ సుధీర్, వీఆర్వో శివశంకర్ పాల్గొన్నారు

గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం

గుడివాడరూరల్: గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో రూ.41.20 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్లు, కాంపౌండ్‌వాల్ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ వెలగలేటి రమ్యతో కలసి రావి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు అథార్టీ సభ్యులు కామేపల్లి తులసీబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ వి.సూరిబాబు పాల్గొన్నారు.

మినీ గోకులాలు, సీసీ రోడ్లకు నిధుల మంజూరు

గుడ్లవల్లేరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద గుడ్లవల్లేరు మండలంలో మినీ గోకులాలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయని ఉపాధి ఏపీఓ పి.రాంప్రసాద్ తెలిపారు. 96 మినీ గోకులాలకు రూ.1.87కోట్లు, 82 సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.7.61కోట్లు పేర్కొన్నారు.

పశు గణనకు సహకరించాలి



గుడివాడలో పశు గణన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రావి, అధికారులు

గుడివాడరూరల్: అఖిల భారత పశు గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పశు పోషకులందరూ సహకరించాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కోరారు. దేశవ్యాప్తంగా చేపట్టిన 21వ అఖిలభారత పశు గణన కార్యక్రమ పోస్టర్లను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహం వద్ద రావి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు పోషణకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయన్నారు. పశు సంవర్ధకశాఖ డీడీలు సి.శ్రీనివాసరావు, టి.రత్నశ్రీ మాట్లాడుతూ గుడివాడ డివిజన్ పరిధిలోని 2.90 లక్షల కుటుంబాలకు సంబంధించి పశువుల వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టు అథార్టీ సభ్యులు కామేపల్లి తులసీబాబు, మాజీ ఎంపీపీ రవికుమార్, అరిపిరాల మాజీ డీసీ అధ్యక్షుడు రవి, మండల పశు వైద్యులు హనుమంతరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: పశుగణన ప్రక్రియను వడ్లమన్నాడులో వెటర్నరీ వైద్యాధికారి వి.శ్రీవీణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019లో ఈ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 30వ తేదీ వరకు ఈ గణన ప్రక్రియ ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో పశు సంపదను ఆయా గ్రామాల వెటర్నరీ సిబ్బంది లెక్కించి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పెన్నేరు రమేష్, పార్టీ నేత వెంకటేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: మండలంలో ఇలపర్రు గ్రామంలో పశు గణన కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు శుక్రవారం ప్రారంభించారు. మండల పశు వైద్యురాలు డాక్టర్ ఎస్.లతాశ్రీ, రుద్రపాక పశు వైద్యురాలు డాక్టర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ గంగాధరరావు

కైకలూరు: వరి సాగులో సమగ్ర పురుగుల, తెగుళ్ల యాజమాన్యం అత్యంత ముఖ్యమని ఏలూరు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధా రైతులకు సూచించారు. వింజరం గ్రామంలో వ్యవసాయ రైతులకు పలు అంశాలపై శిక్షణ శుక్రవారం అందించారు. ఆమె మాట్లాడుతూ రానున్న కాలంలో కాలుష్యాన్ని నివారించడానికి, పెట్టుబడులు తగ్గించుకోవడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ఉత్తమమన్నారు. కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్. గంగాధరరావు రబీ సన్నద్ధతపై రైతులకు వివరించారు. ఏఓ ఆర్.దివ్య ధాన్యం కొనుగోలు విధానాలను రైతులకు చెప్పారు. గ్రామ సర్పంచ్ ధర్మరాజుల నాగమణి, గ్రామ వ్యవసాయ సహాయకులు జె.కనకదుర్గ, బి.గోపినాథ్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో విద్యార్థులకు నో ఎంట్రీ



ఆర్టీసీ బస్సులోకి ఎక్కేందుకు విద్యార్థుల అవస్థలు

బస్ పాస్ ఉన్నా విద్యార్థులను బస్సుల్లో ఎక్కనీయని సిబ్బంది

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు విద్యా సంస్థలకు నిలయం. ఈ కాలేజీల విద్యార్థులు వేలాది మంది చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, హనుమాన్ జంక్షన్, పెడన, ముదినేపల్లి, కైకలూరు తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులకు వస్తుంటారు. ఉదయం గడిచిందిలే అనుకుంటే..సాయంత్రం కాలేజీల నుంచి వెళ్లేటపుడు ఈ విద్యార్థులకు నరకప్రాయమే. అప్పటి వరకు చదివి అలసిపోయి ఇంటి ముఖం పట్టే సమయంలో విద్యార్థులను ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు వేధిస్తున్నారు. బస్సులు ఆపకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

విద్యార్థుల పడిగాపులు

20 నిమిషాలకు ఒక బస్సు వచ్చినా...బస్ పాస్‌లు ఉండే విద్యార్థులను చూసి ఆపకుండా వెళ్లిపోతున్నారు. దీంతో రాత్రి అయినా గంటల తరబడి నిలువుకాళ్ల మీద విద్యార్థులు పడిగాపులు పడుతున్నారు. ఉదయానే మళ్లీ కాలేజీకి రావాలంటే త్వరగా ఇంటికి వెళ్లాల్సిందే. అయితే బస్సులు ఆపక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఏదో ఒక బస్సును మనసున్న డ్రైవర్ ఆపినా...ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో బస్సులో అంతమంది పట్టడం లేదు. మళ్లీ కొంత మంది అదే బస్టాప్‌లో ఆగిపోవటంతో నిరాశే ఎదురవుతోంది. కాలేజీ రోడ్డు వద్ద బస్సులు ఆపరని అంబేడ్కర్ సెంటర్‌లోని బస్టాప్‌కు వచ్చినా...విద్యార్థుల బ్యాగ్‌లను గుర్తు పట్టిన డ్రైవర్లు బస్సులు అక్కడ కూడా ఆపటం లేదు. కాలేజీ నుంచి కిలోమీటర్ల కొద్దీ నడిచి వచ్చినా ఫలితం దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాస్‌లు ఉన్న విద్యార్థులను ఎక్కించుకునేలా చర్యలు తీసుకోవాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



బస్టాప్‌లోనే పడిగాపులుకాస్తున్న విద్యార్థులు

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

పామర్రు: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీలు) ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. మండలంలో 25 గ్రామాల్లో సుమారు రూ.1.35 కోట్ల స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో రోజూ గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి, పొడి చెత్తను రిక్షాల ద్వారా ఈ కేంద్రాలకు తరలించాలి. అక్కడ తడి, పొడి చెత్తను వేరుగా కుండీల్లో వేసి వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించడం, అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను స్క్రాప్ దుకాణాలకు విక్రయించి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నదే ఈ కేంద్రాల ఏర్పాటు లక్ష్యం. అయితే అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఆ లక్ష్యం నీరుగారుతోంది.

అలంకార ప్రాయం

మండలంలోని 25 సంపద తయారీ కేంద్రాల్లో ప్రస్తుతం రెండు మూడు పంచాయతీల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగతా చోట అలంకార ప్రాయంగా మిగిలాయి. కొన్ని కేంద్రాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. అధికారులు వెంటనే స్పందించి ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జమీదగ్గుమిల్లిలో నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం

వినియోగంలోకి తెస్తాం

మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఆ కేంద్రాల్లో వర్మి కంపోస్టు తయారు చేయించి, రైతులకు తక్కువ ధరకు విక్రయించేలా చూస్తాం.

– జ్యోతి, ఎంపీడీఓ

2 నుంచి నిత్యాన్నదానం

ముదినేపల్లి రూరల్: కార్తీకమాసం సందర్భంగా అయ్యప్ప, భవానీ సర్వమాలధారులకు మండలంలోని శ్రీహరిపురం షిర్డిసాయిబాబా ఆలయంలో వచ్చే నెల రెండో తేదీ నుంచి నిత్యాన్నదానం నిర్వహిస్తామని గురుస్వామి నీలం వెంకట నాగమల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మాలధారణ విరమణ చేసేంత వరకు అన్నదానం కొనసాగుతుందని పేర్కొన్నారు.

